# మనం
## హైదరాబాద్
రంగారెడ్డి | మేడ్చల్

మంగళవారం | 16 | జూన్ | 2026 పేజీలు: 7





ఓయూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి

## చర్యలు తీసుకోవాలి



ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు వీసీ వినతి

2



# మంచినీళ్లు ఇవ్వండి మహాప్రభో!

తీవ్ర రూపం దాల్చిన అత్వెల్లి వాసుల నీటి సమస్యలు

దాహార్తిని తీర్చాలంటూ జనాల ఆవేదన

వేసవి చివర్లో కూడా నీటి కష్టాలు

చర్యలు చేపట్టాలని పాలకుల విజ్ఞప్తి

3



# ప్రభుత్వ భూములపై అక్రమ నిర్మాణాల కూల్చివేత






కాప్రా తహసీల్దార్ మతీన్ ఆదేశాలతో చర్యలు.

సర్వే నెం. 645, 179, 208లో నిర్మించిన అక్రమ గదుల తొలగింపు

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక.

*కాప్రా మండల పరిధిలోని జవహర్ నగర్ ప్రాంతంలోని ప్రభుత్వ భూముల్లో అక్రమంగా నిర్మాణాలు చేపట్టినట్లు అందిన సమాచారం మేరకు రెవెన్యూ అధికారులు సోమవారం కూల్చివేత చర్యలు చేపట్టారు.*
*కాప్రా తహసీల్దార్ ఆదేశాల మేరకు గిర్దావర్ సత్యనారాయణ సమక్షంలో సర్వే నెం. 645, 179, 208లో ఉన్న అక్రమ నిర్మాణాలను జేసీబీ సాయంతో తొలగించారు.*

2



2

## వర్షాకాల నిర్వహణకు ఎంఎంసీ ప్రత్యేక కార్యాచరణ

టీజీడీపీఎస్ అధికారులతో కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి సమీక్ష..



2

## వయోధికుల రక్షణ చట్టం పటిష్ట అమలుకు ప్రత్యేక శాఖ ఏర్పాటు చేయాలి

- ఎమ్మెల్సీ కోదండరాం





# ప్రభుత్వ భూములపై అక్రమ నిర్మాణాల కూల్చివేత


**కాప్రా తహసీల్దార్ మతీన్ ఆదేశాలతో చర్యలు.**
**- సర్వే నెం. 645, 179, 208లో నిర్మించిన అక్రమ గదుల తొలగింపు.**
**- ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక.**

జవహర్ నగర్, జూన్ 15 (మనం న్యూస్): కాప్రా మండల పరిధిలోని జవహర్ నగర్ ప్రాంతంలోని ప్రభుత్వ భూముల్లో అక్రమంగా నిర్మాణాలు చేపట్టినట్లు అందిన సమాచారం మేరకు రెవెన్యూ అధికారులు సోమవారం కూల్చివేత చర్యలు చేపట్టారు. కాప్రా తహసీల్దార్ ఆదేశాల మేరకు గిర్దావర్ సత్యనారాయణ సమక్షంలో సర్వే నెం. 645, 179, 208లో ఉన్న అక్రమ నిర్మాణాలను జేసీబీ సాయంతో తొలగించారు. ఈ సందర్భంగా కార్మిక్నగర్లో నిర్మించిన రెండు గదులను, చెన్నాపురం కూడలి సమీపంలో నిర్మించిన మరో గదిని కూల్చివేశారు. అనంతరం తహసీల్దార్ మతిన్ మాట్లాడుతూ ప్రభుత్వ భూములను ఎట్టి పరిస్థితుల్లోనూ ఆక్రమించరాదని, అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# వర్షాకాల నిర్వహణకు ఎంఎంసీ ప్రత్యేక కార్యాచరణ

**టీజీడీపీఎస్ అధికారులతో**
**కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి సమీక్ష..**

సికింద్రాబాద్, జూన్ 15 (మనం న్యూస్) వర్షాకాలంలో ప్రజలకు వేగవంతమైన సేవలు అందించేందుకు మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ) ప్రత్యేక చర్యలు చేపడుతోంది. ఈ నేపథ్యంలో ఎంఎంసీ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి సోమవారం తార్నాకలోని ప్రధాన కార్యాలయంలో తెలంగాణ డెవలప్మెంట్ ప్లానింగ్ సొసైటీ (టీజీడీపీఎస్) అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో రాష్ట్రంలోని వర్షపాతం, వాతావరణ మార్పులు, రియల్టైమ్ వాతావరణ సమాచార వ్యవస్థలపై టీజీడీపీఎస్ అధికారులు ప్రదర్శన ఇచ్చారు. మున్సిపల్ కంట్రోల్ రూమ్ ద్వారా వాతావరణ అంచనాలు, ప్రస్తుత వర్షపాతం పరిస్థితులు, గత 24 గంటల్లో నమోదైన వర్షాల వివరాలను సాంకేతికంగా విశ్లేషించి అందుబాటులో ఉంచనున్నట్లు కమిషనర్ తెలిపారు. సర్కిల్ వారీగా వర్షపాతం నివేదికలు సిద్ధం చేసి సంబంధిత అధికారులకు అందజేస్తామని, వర్షాల సమయంలో కంట్రోల్ రూమ్లో సీనియర్ అధికారులకు ప్రత్యేక బాధ్యతలు అప్పగించినట్లు వెల్లడించారు. డిప్యూటీ కమిషనర్లు పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని, నిర్లక్ష్యం సహించబోమని హెచ్చరించారు. అలాగే అనుమతి లేకుండా అధికారులు నగరాన్ని విడిచి వెళ్లరాదని ఆదేశించారు. ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందించేందుకు కంట్రోల్ రూమ్ వ్యవస్థను బలోపేతం చేసి అదనపు సిబ్బందిని నియమించనున్నట్లు కమిషనర్ వెల్లడించారు. సమావేశంలో ఎంఎంసీ, జీహెచ్ఎంసీ అధికారులు, కంట్రోల్ రూమ్ సిబ్బంది పాల్గొన్నారు.



# మంచినీళ్లు ఇవ్వండి మహాప్రభో!

**తీవ్ర రూపం దాల్చిన అత్వెల్లి వాసుల నీటి సమస్యలు**
**దాహార్తిని తీర్చాలంటూ జనాల ఆవేదన**
**వేసవి చివర్లో కూడా నీటి కష్టాలు**
**చర్యలు చేపట్టాలని పాలకుల విజ్ఞప్తి**



మేడ్చల్, జూన్ 15 ( మనం జిల్లా ప్రతినిధి): పేరుకేమో మున్సిపల్ కార్పొరేషన్ పైగా జిల్లా కేంద్రం కానీ మేడ్చల్ సర్కిల్ పరిధిలోని మేడ్చల్ డివిజన్లోని ప్రజలకు తప్పని నీటి కష్టాలు.మేడ్చల్ సర్కిల్ పరిధిలోని 298వ డివిజన్ అత్వెల్లి ప్రాంతంలో తాగునీటి సమస్య తీవ్రరూపం దాల్చిందని, నీటి సరఫరా సరిగా లేకపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని గత సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరం భూగర్భ జలాలు బాగా తగ్గిపోయాయి అని అందువల్లనే మేడ్చల్ పరిధిలోని బోర్లలో తగినంత నీరు లభించడం లేదని మిషన్ భగీరథ జలాల సప్లై కూడా తగ్గడంతో కొన్ని కాలనీలో రెండు మూడు రోజులకు ఒకసారి నీటి సరఫరా జరుగుతుందని ఇక రోజు రోజుకు విస్తరిస్తున్న పట్టణ జనాభా సరిపడా నీరు సరఫరా కాకపోవడంతో జనాల కాలనీలు పెరుగుతున్నాయి కానీ నీటి వనరుల పెరగడం లేదని కావున అధికారులు స్పందించి వెంటనే పరిష్కార చర్యలు చేపట్టాలని మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు డిమాండ్ చేశారు.అత్వెల్లి ప్రాంతంలోని 1, 2, 3 వార్డుల్లో గత కొన్ని రోజులుగా తాగునీటి సరఫరా సక్రమంగా జరగకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యపై మాజీ కౌన్సిలర్లు శ్రావణ్ కుమార్ గుప్తా, జాకట దేవరాజ్, నారెడ్డి రవీందర్ రెడ్డిలు స్పందించి మేడ్చల్ మున్సిపల్ కార్పొరేషన్ జోన్ డిప్యూటీ కమిషనర్ సుధాంష్ను కలిసి రాతపూర్వక ఫిర్యాదు అందజేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పాత అత్వెల్లి పట్టణంలోని రాఘవేంద్ర నగర్ కాలనీతో పాటు సమీపంలోని పలు సబ్ కాలనీల్లో గత కొద్ది రోజులుగా తాగునీటి సరఫరా పూర్తిగా నిలిచిపోయిందని తెలిపారు. దీంతో స్థానిక ప్రజలు, ముఖ్యంగా మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

తాగునీటి కోసం ప్రజలు ప్రత్యామ్నాయ మార్గాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడిందని, ఇది ప్రజల దైనందిన జీవితంపై తీవ్ర ప్రభావం చూపుతోందని పేర్కొన్నారు. తాగునీరు ప్రజల ప్రాథమిక అవసరమని, అత్వెల్లి ప్రాంతంలోని 1, 2, 3 వార్డుల్లో వెంటనే నీటి సరఫరాను పునరుద్ధరించి క్రమబద్ధంగా అందేలా చర్యలు తీసుకోవాలని మాజీ కౌన్సిలర్లు జాకట దేవరాజ్, శ్రావణ్ కుమార్ గుప్తా డిప్యూటీ కమిషనర్ను కోరారు.

# ఓయూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

**ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు వీసీ వినతి**



సికింద్రాబాద్, జూన్ 15 (మనం న్యూస్) ఉస్మానియా విశ్వవిద్యాలయం బోధన, బోధనేతర ఉద్యోగులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని ఓయూ ఉపకులపతి ఆచార్య కుమార్ మొలుగరం రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను కోరారు. సోమవారం ఉపముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన ఆయన, ఉద్యోగుల సంక్షేమానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన వీసీ, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, విద్యా ప్రమాణాల పెంపు, పరిశోధనా కార్యకలాపాల గురించి వివరించారు. ఉద్యోగుల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు కృతజ్ఞతలు తెలుపుతూ, ఉద్యోగులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) లేదా పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) అంశంపై త్వరితగతిన నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగుల సమస్యలపై స్పందించిన ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఓయూ ప్రతినిధి బృందం నుంచి పూర్తి వివరాలు తెలుసుకొని ప్రభుత్వం సానుకూల దృక్పథంతో పరిశీలించి వీలైనంత త్వరగా పరిష్కారం చూపేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు ప్రతినిధి బృందం వెల్లడించింది. ఈ విషయంలో తన సహకారం, అవసరమైన జోక్యం ఎల్లప్పుడూ ఉంటుందని భరోసా ఇచ్చినట్లు పేర్కొంది. ఇదిలా ఉండగా, బోధన, బోధనేతర ఉద్యోగుల సంక్షేమం కోసం చొరవ చూపుతూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న వీసీ ప్రొ. కుమార్ మొలుగరంకు ఓయూ అధ్యాపకులు ప్రొ. పి. చంద్రశేఖర్, ప్రొ. సిహెచ్. శ్రీనివాస్, ప్రొ. బి. మంగు, ప్రొ. రాజేందర్ నాయక్ కృతజ్ఞతలు తెలిపారు. ఆయన నాయకత్వంలో ఉద్యోగుల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ఉపముఖ్యమంత్రిని కలిసిన వారిలో ఓయూ రిజిస్ట్రార్ ప్రొ. జి. నరేష్ రెడ్డి, ఓఎస్డీ ప్రొ. జితేందర్ కుమార్ నాయక్, ప్రొ. జి. మల్లేశం, డాక్టర్ చలమల్ల వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

# వయోధికుల రక్షణ చట్టం పటిష్ట అమలుకు ప్రత్యేక శాఖ ఏర్పాటు చేయాలి

**ఎమ్మెల్సీ కోదండరాం**



సికింద్రాబాద్, జూన్ 15 (మనం న్యూస్) వయోధికుల రక్షణ చట్టం-2007ను తెలంగాణలో సమర్థవంతంగా అమలు చేయడానికి ప్రభుత్వం ప్రత్యేక శాఖను ఏర్పాటు చేసి, తగిన బడ్జెట్ను కేటాయించాలని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం కోరారు. సోమవారం తార్నాకలోని మర్రి కృష్ణా హాల్లో తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ వయోధికుల వేదింపుల అవగాహన దినోత్సవం సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆరోగ్య రంగంలో వచ్చిన పురోగతి, కుటుంబ నియంత్రణ విధానాల కారణంగా వయోధికుల సంఖ్య పెరుగుతోందని ఆయన పేర్కొన్నారు. అయితే వృద్ధులపై వివక్ష, నిర్లక్ష్యం, వేధింపులు కూడా పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో వయోధికుల హక్కుల పరిరక్షణకు, వారిపై జరిగే వేధింపుల నివారణకు ఐక్యరాజ్యసమితి ప్రత్యేక అవగాహన దినోత్సవాన్ని ప్రకటించిందని తెలిపారు. వయోధికులు నిర్లక్ష్యం లేదా వేధింపులకు గురైన సందర్భాల్లో ట్రిబ్యునళ్లను ఆశ్రయించి న్యాయం పొందే అవకాశం ఉందని కోదండరాం వివరించారు. సమాజంలో వృద్ధుల పట్ల గౌరవం, భద్రత పెంపొందేలా ప్రభుత్వం అన్ని స్థాయిల్లో చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జస్టిస్ చంద్రకుమార్, ప్రొఫెసర్ మసన చెన్నప్ప, తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పి. నరసింహారావు, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ చౌదరి తదితరులు పాల్గొన్నారు.



# రహదారిపై గుంతలు పూడ్చిన 16వ 21వ వార్డు కౌన్సిలర్లు

మేడ్చల్, జూన్ 15 ( మనం జిల్లా ప్రతినిధి ): ఎల్లంపేట మున్సిపాలిటీ పరిధిలో డబిల్ పూర్ నుండి నూతనకల్ వచ్చే రహదారిలో ప్రమాదకరంగా ప్రధాన రోడ్డులో గుంతలు పడటంతో ఎంతోమంది వాహనదారులు ప్రమాదాల గురై గాయాల పాలవుతున్నారు, పలువురు ప్రజలు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన అధికారులు స్పందించకపోవడంతో స్థానిక కౌన్సిలర్లు సద్ది సురేష్ రెడ్డి, చిన్నోళ్ల భాస్కర్, సోమవారం ఉదయం రెడీ మిక్సర్ ను తీసుకువచ్చి గుంతలను రెడీ మిక్స్ తో నింపి గుంతలను పూడ్చి వేయడం జరిగింది. గుంతలను పూడ్చి రహదారిని ప్రయాణానికి అనుకూలంగా మార్చిన స్థానిక కౌన్సిలర్లు ఇద్దరికీ ప్రజలు అభినందనలు తెలియజేశారు.

ఈ సందర్భంగా కౌన్సిలర్ సురేష్ రెడ్డి మాట్లాడుతూ రహదారిపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడడంతో గ్రామ ప్రజలు వాహనదారులు ఎంతో ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ప్రమాదాలు జరుగకుండా తమవంతు కృషి చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు స్థానిక నాయకులు, పలువురు అభినందించారు.



# సికింద్రాబాద్ లాడ్జ్‌లో 17 కిలోల గంజాయి పట్టివేత

**ఒడిశా నుంచి పూణేకు తరలిస్తుండగా పోలీసుల దాడి..**

**ఇద్దరి అరెస్ట్.. 13 ప్యాకెట్లు, రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం..**



సికింద్రాబాద్, జూన్ 15 (మనం న్యూస్) సికింద్రాబాద్ గోపాలపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని దేవకి లాడ్జ్ లో 17 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి 13 ప్యాకెట్లలో ఉన్న 17 కిలోల గంజాయితో పాటు రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు మల్కాజిగిరి ఏసీపీ యాదగిరి రెడ్డి తెలిపారు. గోపాలపురం పోలీసు స్టేషన్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ యాదగిరి రెడ్డి వివరాలు వెల్లడించారు. ఒడిశా రాష్ట్రంలోని సంబల్పూర్ నుంచి మహారాష్ట్రలోని పూణేకు గంజాయిని అక్రమంగా తరలిస్తున్నారనే పక్కా సమాచారంతో గోపాలపురం పోలీసులు దేవకి లాడ్జ్ వద్ద తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా అనుమానాస్పదంగా సంచరిస్తున్న బిహార్కు చెందిన విజయ్, మేడ్చల్ జిల్లాకు చెందిన రిషిని అదుపులోకి తీసుకుని విచారించగా గంజాయి అక్రమ రవాణా వ్యవహారం వెలుగులోకి వచ్చింది. విచారణలో గంజాయిని హైదరాబాద్ మీదుగా పూణేకు తరలిస్తున్నట్లు తేలిందని పోలీసులు వెల్లడించారు. ఈ కేసులో మరో మైనర్ను కూడా అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. కాగా, ఈ అక్రమ రవాణా వెనుక ఉన్న ప్రధాన నిందితుడి కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. సమావేశంలో గోపాలపురం ఇన్స్పెక్టర్ ఎం. మధు కుమార్, డీఐ సీ. హెచ్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



# సామాన్యుల సంక్షేమమే లక్ష్యంగా ఆర్ఎస్పీ పార్టీ

**: జాకట శ్రీనివాస్**



మేడ్చల్, జూన్ 15 (మనం జిల్లా ప్రతినిధి ): నియోజకవర్గ అభివృద్ధి, సామాన్య ప్రజల సంక్షేమమే తమ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర సామాన్య ప్రజా పార్టీ (ఆర్ఎస్పీ) వ్యవస్థాపక అధ్యక్షుడు, మేడ్చల్ ఎమ్మెల్యే అభ్యర్థి జాకట శ్రీనివాస్ తెలిపారు. మేడ్చల్ మండలం అత్వెల్లి గ్రామానికి చెందిన తాను రైతు కుటుంబంలో జన్మించి ప్రజా సమస్యలను దగ్గరగా చూసి పెరిగానని పేర్కొన్నారు. ధనబలం, కులబలం ఆధారిత రాజకీయాలకు ప్రత్యామ్నాయంగా సామాన్య ప్రజల గొంతుకగా ఆర్ఎస్పీ పార్టీని స్థాపించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా పార్టీ ప్రధాన హామీలను వెల్లడిస్తూ కార్పొరేట్ స్థాయి ఉచిత విద్య, మెరుగైన ఉచిత వైద్యం, రేషన్ ద్వారా సన్నబియ్యం పంపిణీ, పేద కుటుంబాలకు ఉచిత వస్త్రాలు, ఇల్లు లేని వారికి 2 బీహెచ్కే గృహాలు అందజేస్తామని హామీ ఇచ్చారు. మేడ్చల్లో 100 పడకల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటు చేస్తామని తెలిపారు. గత మూడు దశాబ్దాలుగా నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించిన నాయకులు ప్రజల మౌలిక సమస్యలను పూర్తిగా పరిష్కరించలేకపోయారని విమర్శించారు. రోడ్లు, తాగునీరు, ఉపాధి అవకాశాల కల్పనలో ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలు ఆర్ఎస్పీ పార్టీకి మద్దతు ఇచ్చి సామాన్యుల పాలనకు అవకాశం కల్పించాలని జాకట శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు.

# నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**గుండ్ల పోచంపల్లి విద్యుత్ శాఖ విజయకుమార్**

మేడ్చల్ జూన్ 15 ( మనం జిల్లా ప్రతినిధి ): గుండ్ల పోచంపల్లి ఎస్ఎస్ ఫీడర్ పరిధి లక్ష్మీ నగర్ ఫీడర్ 33/ 11 కెవి కింద నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని గుండ్ల పోచంపల్లి విద్యుత్ శాఖ ఏఈ కే విజయ్ కుమార్ తెలిపారు. చెట్ల కొమ్మలు నరకడంతో పాటు, ఇతర మెయింటెనెన్స్ వరక్స్ కోసం విద్యుత్ సరఫరా లో అంతరాయం కలుగనుందని ఏ ఈ తెలిపారు. దీనివల్ల లక్ష్మీ నగర్, మాణిక్ రెడ్డి నగర్, ఓర్జిత విలాస్, 2,3, సంజనస్ అపార్ట్మెంట్స్ ప్రైమ్యూస్ ఇప్సిలోన్స్, ప్రెస్టేజ్ గ్రీన్ కు విద్యుత్ సరఫరా లో అంతరాయం ఉంటుందన్నారు. మధ్యాహ్నం 3 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్తు సరఫరా లో అంతరాయం ఉంటుందన్నారు.






## ఎల్లంపేట మున్సిపల్ టిపిఓగా మహేష్ చంద్రకాంత్

మేడ్చల్, జూన్ 15 ( మనం జిల్లా ప్రతినిధి): మేడ్చల్ జిల్లా ఎల్లంపేట మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారిగా మహేష్ చంద్రకాంత్ నియామకమయ్యారు. వికారాబాద్ నుండి బదిలీపై వచ్చిన ఆయన ఎల్లంపేట మున్సిపల్ కార్యాలయంలో రెండు రోజులు పనిచేయనున్నారు. శుక్రవారం, శనివారం ఎల్లంపేట మున్సిపాలిటీలో బుధ గురువారం అలియాబాద్, సోమ మంగళవారం మూడు చింతలపల్లి లో విధులు నిర్వహించనున్నారు.

**మేడ్చల్ టౌన్ ప్లానింగ్ అధికారిగా భాస్కర్**

మేడ్చల్ టౌన్ ప్లానింగ్ అధికారిగా భాస్కర్ నియామకమయ్యారు. ఇంత ముందు పని చేసిన ఎసిపి, టౌన్ ప్లానింగ్ అధికారి బదిలీ కాక టౌన్ ప్లానింగ్ అధికారిగా భాస్కర్ నియామకమయ్యారు. అయితే పూర్తిస్థాయి టౌన్ ప్లానింగ్ అధికారిగా భాస్కర్ నియామకం కావడం విశేషం.

## మేడ్చల్ ప్రాంతంలో అడుగంటిన భూగర్భ జలాల

**సమస్యకు పరిష్కారం చూపాలని మేడ్చల్ డిప్యూటీ కమిషనర్ ను కోరిన బీజేపీ నాయకులు**

మేడ్చల్, జూన్ 15 ( మనం జిల్లా ప్రతినిధి): మానవాళి మునగడ పూర్తిగా నీటి చుట్టూనే కేంద్రీకృతమై ఉంది, అభివృద్ధిలో జనాభాలో శరవేగంగా విస్తరిస్తున్న మేడ్చల్ ప్రాంతంలో భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటిపోయిన విషయాన్ని దృష్టిలో ఉంచుకొని చెరువుల్లోని పూడికతీత ఆయా చెరువుల కట్టలను బలోపేతంగా నిర్మించాల్సిన అవసరాన్ని పేర్కొంటూ మేడ్చల్ డివిజన్ బిజెపి అధ్యక్షులు జల్లి శైలజ ఆధ్వర్యంలో మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ సుదాంశ్ కు వినతి పత్రం అందజేశారు.



ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి జకట ప్రేమ్ దాస్,కానుగంటి వంశీ విజయ్,ఉపాధ్యక్షులు మైసరి రాజు,సర్వేశ్వర్ రెడ్డి, కార్యదర్శులు బండి విష్ణు సురేందర్ రెడ్డి, సీనియర్ నాయకులు పాతూరి సుధాకర్ రెడ్డి,రాఘవ రెడ్డి,దాత్రిక లక్ష్మణ్, చెరువుకొమ్ము శ్రీనివాస్ గౌడ్,నేమూరి శ్రీనివాస్ గౌడ్, వంశీధర్ రెడ్డి,శ్రీపాల్ రెడ్డి,కవిరాజు,గోలికర్ మహేశ్,నర్సింగ్ రావు,భరత్ కానుగంటి,పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు

# జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ సమస్యపై కలెక్టర్కు వినతి

**ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్.**
**డంపింగ్ యార్డ్ వల్ల లక్షలాది మంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని జేఏసీ ఆవేదన**
**సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి హామీ**





జవహర్ నగర్, జూన్ 15 (మనం న్యూస్) : జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ ఎత్తివేత పోరాట కమిటీ ఆధ్వర్యంలో సోమవారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో డంపింగ్ యార్డ్ సమస్యపై వినతిపత్రం సమర్పించారు. వివిధ ప్రజాసంఘాల ప్రతినిధులు జిల్లా అధికారులను కలిసి సమస్య తీవ్రతను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ ఆసియాలోనే అతిపెద్ద చెత్త నిల్వ కేంద్రాల్లో ఒకటిగా మారిందని, రోజుకు వేల టన్నుల చెత్త ఇక్కడకు చేరుతుండటంతో పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర కాలుష్య సమస్యలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. కలుషిత గాలి, నీటి కారణంగా శ్వాసకోశ వ్యాధులు, డెంగ్యూ, మలేరియా, క్యాన్సర్ వంటి అనారోగ్య సమస్యలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

డంపింగ్ యార్డ్ పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్న లక్షలాది మంది ప్రజల ఆరోగ్యం, జీవన ప్రమాణాలు ప్రమాదంలో ఉన్నాయని పేర్కొంటూ, యుద్ధ ప్రాతిపదికన సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా స్పందించిన జిల్లా అదనపు కలెక్టర్ డి. విజయేందర్ రెడ్డి సమస్య తీవ్రతను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యల కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు జేఏసీ నాయకులు తెలిపారు.




## మేడ్చల్ ప్రభుత్వ పాఠశాలలో పాఠ్యపుస్తకాలు, నోట్బుక్స్ పంపిణీ

మేడ్చల్, జూన్ 15( మనం జిల్లా ప్రతినిధి ) : తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభమైన సందర్భంగా మేడ్చల్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్బుక్స్ పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో మేడ్చల్ మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ చెర్ల రమేష్ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మంజుల, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజిరెడ్డి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా చెర్ల రమేష్ మాట్లాడుతూ, విద్యార్థులే దేశ భవిష్యత్తని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని అన్నారు.

ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో విద్యారంగానికి ప్రత్యేక ప్రాధాన్యత లభిస్తోందని తెలిపారు. ముఖ్యంగా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు ద్వారా పేద మరియు గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్య అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఆధునిక మౌలిక వసతులు, డిజిటల్ విద్య, మెరుగైన బోధన విధానాలు అమలు చేయడం ద్వారా విద్యార్థుల భవిష్యత్తును మరింత ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు.విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించి సమాజానికి ఆదర్శంగా నిలవాలని చెర్ల రమేష్ ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.



## నిజాం కాలేజ్ పీజీ బాయ్స్ హాస్టల్ను తనిఖీ చేసిన ఓయూ వీసీ

సికింద్రాబాద్, జూన్ 15 (మనం న్యూస్) ఉస్మానియా విశ్వవిద్యాలయ వైస్-ఛాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగురం సోమవారం నిజాం కాలేజీ పీజీ బాయ్స్ హాస్టల్ను సందర్శించి మౌలిక సదుపాయాలను పరిశీలించారు. హాస్టల్లోని విద్యార్థుల గదులు, డైనింగ్ హాళ్లు, శానిటేషన్ బ్లాకులు, ఉమ్మడి వినోద ప్రదేశాలను తనిఖీ చేసి విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. హాస్టల్ భవనాల పరిస్థితిపై స్పందించిన వీసీ, అవసరమైన మరమ్మతు పనులను తక్షణమే చేపట్టాలని, శిథిలావస్థకు చేరిన భాగాలను పునర్నిర్మించాలని యూనివర్సిటీ బిల్డింగ్స్ డివిజన్ అధికారులను ఆదేశించారు. విద్యార్థుల భద్రత, సంక్షేమానికి విశ్వవిద్యాలయం అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని ఆయన పేర్కొన్నారు. క్యాంపస్లో నివసించే విద్యార్థులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన, విద్యాభ్యాసానికి అనుకూలమైన వసతి కల్పించేందుకు ఓయూ కట్టుబడి ఉందని వీసీ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి. నరేష్ రెడ్డి, వీసీ ఓఎస్డీ ప్రొఫెసర్ ఎస్. జితేందర్ నాయక్, నిజాం కాలేజ్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చొల్లేటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# కుషాయిగూడలో నూతన విద్యా సంవత్సరం వేడుకలు

**పూలతో విద్యార్థులకు స్వాగతం పలికిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**

**పాఠ్యపుస్తకాలు పంపిణీ చేసి ఉన్నత లక్ష్యాల సాధనకు విద్యార్థులకు పిలుపు**



కుషాయిగూడ, జూన్ 15 (మనం న్యూస్): నూతన విద్యా సంవత్సరం ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని కుషాయిగూడ ప్రభుత్వ పాఠశాలలో సోమవారం ఘనంగా నిర్వహించిన కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాల్గొని విద్యార్థులకు పూలతో స్వాగతం పలికారు. అనంతరం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేసి నూతన



విద్యా సంవత్సరానికి ఆహ్వానం తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలకు చేరుకున్న ఎమ్మెల్యేకు ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు ఘన స్వాగతం పలికారు. ప్రత్యేకంగా నిర్వహించిన స్వాగత కార్యక్రమం ఆకట్టుకుంది. విద్యార్థులను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతన విద్యా సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తోందని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తు బంగారు బాటలో సాగాలంటే ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. విద్యతో పాటు నైతిక విలువలు, క్రీడలు, సృజనాత్మకతను పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వర్షాకాల సన్నద్ధత పనుల పరిశీలన

**విస్తృతంగా పర్యటించిన కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి**





మేడ్చల్, జూన్ 15 ( మనం జిల్లా ప్రతినిధి): మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ) పరిధిలో వర్షాకాల సన్నద్ధత పనులను కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బోడుప్పల్ శ్రీనివాస కాలనీ, ఉప్పల్ విజయపురి కాలనీ, వెంకటేశ్వర కాలనీ, సర్వే కాలనీ, ఐడీఏ ఉప్పల్లోని డీఎస్ఎల్ అబాకస్ ఐటీ పార్క్, రామంతాపూర్ చర్చి కాలనీ ప్రాంతాల్లో పర్యటించి వర్షపు నీటి పారుదల, నాలాలు, డ్రైనేజీ వ్యవస్థల పరిస్థితిని సమీక్షించారు. బోడుప్పల్, విజయపురి కాలనీలలో నీరు నిలిచే ప్రాంతాలు, వరద నీటి కాలువలు, భూగర్భ డ్రైనేజీ అనుసంధానాన్ని పరిశీలించిన కమిషనర్. భారీ వర్షాల సమయంలో నీటి ప్రవాహం నిరాటంకంగా సాగేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (డీఆర్ఎఫ్), హైడ్రా బృందాల సన్నద్ధతను సమీక్షించి అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందించేలా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వెంకటేశ్వర కాలనీలో నాలాలు, డ్రెయిన్ల అనుసంధానాన్ని పరిశీలించిన ఆయన, వర్షపు నీరు రహదారులపై నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని, ట్రాఫిక్కు అంతరాయం కలగకుండా డ్రైనేజీ వ్యవస్థను సమర్థంగా నిర్వహించాలని సూచించారు. హైడ్రా-డీఆర్ఎఫ్ అత్యవసర స్పందన వాహనంలోని పరికరాల పనితీరును పరిశీలించి అవి ఎల్లప్పుడూ వినియోగానికి సిద్ధంగా ఉండేలా చూడాలని ఆదేశించారు. సర్వే కాలనీలో నాలాలు, డ్రెయిన్లను నిరంతరం శుభ్రపరచి నీటి ప్రవాహానికి ఆటంకాలు లేకుండా చూడాలని సూచించిన కమిషనర్, ఐడీఏ ఉప్పల్లోని డీఎస్ఎల్ అబాకస్ ఐటీ పార్క్ వద్ద నాలా నీరు రోడ్డుపైకి పొంగి రావడంపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. సమస్యకు గల కారణాలను పరిశీలించి స్టార్మ్ వాటర్ డ్రెయిన్ వ్యవస్థ నిర్వహణను మెరుగుపరచాలని అధికారులను ఆదేశించారు. రామంతాపూర్ చర్చి కాలనీలో రహదారులు, ఫుట్పాత్ల పరిస్థితిని పరిశీలించిన కమిషనర్, చెత్తను అక్రమంగా పారవేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పరిశుభ్రత చర్యలను మరింత ముమ్మరం చేయాలని పారిశుద్ధ్య సిబ్బందికి సూచించారు. వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని ఆయన స్పష్టం చేశారు.

# కాప్రా సబ్రిజిస్ట్రార్ కార్యాలయంపై ఫిర్యాదు

**అవినీతి ఆరోపణలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కలెక్టర్కు వినతి**

**కాప్రా ఎస్ఆర్ఓ, సీనియర్ అసిస్టెంట్పై ఫిర్యాదు చేసిన బీజేపీ ప్రతినిధులు.**

**ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్.**






కుషాయిగూడ, జూన్ 15 (మనం న్యూస్) : మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ప్రతినిధులు సోమవారం జిల్లా కలెక్టర్ను కలిసి వినతిపత్రం అందజేశారు. కాప్రా సబ్రిజిస్ట్రార్ కార్యాలయం (ఎస్ఆర్ఓ)లో అవినీతి, అక్రమాలకు పాల్పడుతూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపిస్తూ, అక్కడి సబ్రిజిస్ట్రార్ మరియు సీనియర్ అసిస్టెంట్పై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. ఆరోపణలు నిజమని తేలితే సంబంధిత అధికారులపై తగిన క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని కలెక్టర్కు విజ్ఞప్తి చేశారు. ప్రజలకు పారదర్శకమైన సేవలు అందేలా జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టాలని బీజేపీ ప్రతినిధులు కోరారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





# ప్రజావాణిలో 24 వినతుల స్వీకరణ

సికింద్రాబాద్, జూన్ 15 (మనం న్యూస్) ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని త్వరితగతిన పరిష్కరించేందుకు మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో సోమవారం 24 వినతిపత్రాలు అందాయి. తార్నాకలోని కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో కమిషనర్ టి. వినయ్ కృష్ణా రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలు, ఫిర్యాదులు, వినతులను నేరుగా అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అందిన వినతుల్లో ఇంజినీరింగ్ విభాగానికి 9, టౌన్ ప్లానింగ్కు 10, శానిటరీకి 2, వెటర్నరీకి 2, అడ్మినిస్ట్రేషన్కు 1 వినతి చెందినవి. మొత్తం 24 వినతులను సంబంధిత శాఖలకు పంపించి తక్షణ చర్యలు చేపట్టాలని కమిషనర్ ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో పారదర్శకత, వేగవంతమైన స్పందన, సమర్థవంతమైన సేవలందించేందుకు కార్పొరేషన్ కట్టుబడి ఉందని ఆయన తెలిపారు. సమస్యలు పూర్తిగా పరిష్కారమయ్యే వరకు నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని పేర్కొన్నారు.

# గాంధీ ఆసుపత్రిలో గుర్తుతెలియని మహిళ

**ఆచూకీ కోసం పోలీసుల విజ్ఞప్తి**



సికింద్రాబాద్, జూన్ 15 (మనం న్యూస్) సికింద్రాబాద్ లోని గాంధీ ఆసుపత్రిలో గుర్తుతెలియని ఓ మహిళ గత రెండు రోజులుగా చికిత్స పొందుతోంది. ఆమెను కొందరు గుర్తుతెలియని వ్యక్తులు ఆసుపత్రిలో చేర్పించిన అనంతరం వెళ్లిపోయినట్లు సమాచారం. అయితే ఇప్పటివరకు మహిళకు సంబంధించిన వ్యక్తిగత వివరాలు, కుటుంబ సభ్యుల సమాచారం తెలియరాలేదని చిలకలగూడ పోలీసులు తెలిపారు. మహిళ ఆరోగ్య పరిస్థితిని వైద్యులు పర్యవేక్షిస్తున్నారని పేర్కొన్నారు. ఈ మహిళను ఎవరైనా గుర్తిస్తే వెంటనే చిలకలగూడ పోలీస్ స్టేషన్ లేదా సంబంధిత అధికారులను సంప్రదించి సమాచారం అందించాలని చిలకలగూడ ఏసీపీ శశాంక్ రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మహిళ కుటుంబ సభ్యులను గుర్తించేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు.

# కేజీబీవీలో లెక్చరర్ పోస్టుల భర్తీ



చేవెళ్ల, జూన్ 15(మనం న్యూస్): మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల కళాశాల లో 2026-27 విద్యాసంవత్సరానికి గాను తెలుగు, ఫిజిక్స్, జువాలజీ సబ్జెక్టులలో లెక్చరర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రత్యేక అధికారి శ్వేతారెడ్డి తెలిపారు. సంబంధిత సబ్జెక్టుల్లో పీజీ పూర్తి చేసిన మహిళా అభ్యర్థులు అర్హులు. ఆసక్తి గలవారు తమ దరఖాస్తులను ఈనెల 20-06-2026 సాయంత్రం 5:00 గంటల లోపు కళాశాలలో సమర్పించాలని ఆమె కోరారు.

## తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్యకు శుభాకాంక్షలు

**శాలువా కప్పి సన్మానించిన గరిసెల సురేందర్ ముదిరాజ్**



మేడ్చల్, జూన్ 15 ( మనం జిల్లా ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ గా ఇటీవల రెండోసారి ప్రభుత్వం నియమించిన సందర్భంగా వరంగల్ మాజీ పార్లమెంట్ సభ్యులు సిరిసిల్ల రాజయ్య ను తెలంగాణ హైదరాబాదులోని స్టేట్ ఫైనాన్స్ కమిషన్ కార్యాలయంలో మాజీ సర్పంచ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గరిసెల సురేందర్ ముదిరాజ్ మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

## బాలికపై అత్యాచారం కేసులో నిందితుడికి 10 ఏళ్ల జైలు శిక్ష

మేడ్చల్, జూన్ 15 ( మనం జిల్లా ప్రతినిధి ): 11 ఏళ్ల క్రితం బాలికపై జరిగిన అత్యాచార కేసులో నిందితుడికి కోర్టు కఠిన శిక్ష విధించింది. మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన ఈ పోక్సో కేసును విచారించిన ప్రత్యేక న్యాయస్థానం, నిందితుడికి 10 ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చింది. అలాగే బాధితురాలికి రూ.లక్ష పరిహారం చెల్లించాలని కోర్టు ఆదేశించింది.



# కీసర ఎస్సీ స్మశాన వాటికలో మౌలిక సదుపాయాల కల్పనకు మరోసారి వినతి

**ప్రజావాణిలో జిల్లా కలెక్టర్కు అర్జీ అందజేసిన తుడుం శ్రీనివాస్**

**స్నానాల గదులు, హైమాస్ట్ లైట్లు, వేయిటింగ్ షెడ్ ఏర్పాటు చేయాలని డిమాండ్**



కీసర, జూన్ 15 (మనం న్యూస్) : కీసర డివిజన్-1 పరిధిలోని కీసర గ్రామ ఎస్సీ స్మశాన వాటికలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ కీసర గ్రామపంచాయతీ మాజీ వార్డు సభ్యులు తుడుం శ్రీనివాస్ సోమవారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్కు ప్రజావాణి కార్యక్రమంలో మరోసారి వినతి పత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ స్మశాన వాటికలో నిర్మిస్తున్న స్నానాల గదులు అసంపూర్తిగా ఉండటంతో మహిళలు, ఇతరులు సురక్షితంగా వినియోగించుకునే పరిస్థితి లేదని తెలిపారు. దీంతో బహిరంగ ప్రదేశాల్లో స్నానం చేయాల్సిన పరిస్థితి ఏర్పడి ప్రజారోగ్యం, గౌరవప్రదమైన వాతావరణం దెబ్బతింటోందని పేర్కొన్నారు.

అలాగే స్మశాన వాటికలో పచ్చదనాన్ని పెంపొందించేందుకు మొక్కలు నాటడం, వాటి సంరక్షణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని కోరారు.

అంతేకాకుండా వేయిటింగ్ రూమ్ లేదా షెడ్, తాగునీటి సౌకర్యం, డ్రైనేజ్, పారిశుద్ధ్య వసతులు వంటి ప్రాథమిక మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. స్మశాన వాటిక వద్ద విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో పాటు హైమాస్ట్ లైట్లు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గత మూడు నెలలుగా సంబంధిత అధికారులకు పలుమార్లు వినతులు సమర్పించినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే అక్కడి పరిస్థితులకు సంబంధించిన ఫోటోలు, గతంలో ఇచ్చిన అర్జీల ప్రతులను కూడా అధికారులకు అందజేసినట్లు తెలిపారు. కావున అధికారులు కీసర ఎస్సీ స్మశాన వాటికను ప్రత్యక్షంగా పరిశీలించి, పెండింగ్లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించి గౌరవప్రదమైన అంత్యక్రియలకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని తుడుం శ్రీనివాస్ కోరారు.

# మోదీ 12 ఏళ్ల పాలన దేశ అభివృద్ధికి బలమైన పునాది: బీజేపీ

**12 ఏళ్ల పాలనలో అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం.. జీఎస్టీ, మేక్ ఇన్ ఇండియా దేశ ఆర్థిక వ్యవస్థకు బలాన్నిచ్చాయి..**





సికింద్రాబాద్, జూన్ 15 (మనం న్యూస్) ప్రధానమంత్రి మోదీ పాలన దేశ అభివృద్ధికి బలమైన పునాది వేసిందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతమ్, రాష్ట్ర అధికార ప్రతినిధి సంగప్ప పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం 12 ఏళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా సికింద్రాబాద్లో నిర్వహించిన మీడియా సమావేశంలో గౌతమ్, సంగప్ప పాల్గొని మాట్లాడారు. 2014లో ప్రజలు మోదీపై ఉంచిన విశ్వాసం ఫలితంగా దేశం ఆర్థిక, సామాజిక, మౌలిక సదుపాయాలు, జాతీయ భద్రత రంగాల్లో గణనీయమైన పురోగతి సాధించిందని వారు తెలిపారు. జీఎస్టీ, మేక్ ఇన్ ఇండియా, స్టార్టప్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్ వంటి కార్యక్రమాల ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతం కాగా, యువతకు ఉపాధి అవకాశాలు పెరిగి విదేశీ పెట్టుబడులు ఆకర్షించబడినట్లు పేర్కొన్నారు. ఆయుష్మాన్ భారత్, ఉజ్వల యోజన, ప్రధానమంత్రి ఆవాస్ యోజన, స్వచ్ఛ భారత్ మిషన్ వంటి పథకాల ద్వారా కోట్లాది మంది లబ్ధి పొందారని వివరించారు. డిజిటల్ ఇండియా, యూపీఐ చెల్లింపులు, డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్ఫర్ వంటి కార్యక్రమాల ద్వారా పారదర్శక పాలన అందించగలిగామని తెలిపారు. జాతీయ భద్రత విషయంలో సర్జికల్ స్ట్రైక్స్, బాలాకోట్ వైమానిక దాడులు, ఆర్టికల్ 370 రద్దు, పౌరసత్వ సవరణ చట్టం అమలు, రామ మందిర నిర్మాణం వంటి నిర్ణయాలు దేశ చరిత్రలో కీలక మైలురాళ్లుగా నిలిచాయని పేర్కొన్నారు. కరోనా మహమ్మారి సమయంలో ప్రపంచంలోనే అతిపెద్ద టీకా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించి, ఉచిత ధాన్య పంపిణీ ద్వారా ప్రజలకు అండగా నిలిచిందని చెప్పారు. 'వికసిత్ భారత్-2047' లక్ష్య సాధనలో ప్రతి భారతీయుడు భాగస్వామి కావాలని పిలుపునిచ్చిన నాయకులు, మోదీ ప్రభుత్వ 12 ఏళ్ల విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ మహంకాళి జిల్లా అధ్యక్షుడు భరత్ గౌడ్, జిల్లా ఇంచార్జ్ నందనం దివాకర్, సీనియర్ నాయకులు వెంకటరమణి, మేకల సారంగపాణి, కనకట్ల హరి, నందు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# నేటికీ సమాజానికి స్ఫూర్తిగా శ్రీశ్రీ రచనలు

**ఈసీ నగర్లో మహాకవి శ్రీశ్రీ వర్ధంతి సంస్మరణ సభ ఘనంగా నిర్వహణ**

**తెలుగు సాహిత్యానికి ఆయన సేవలు చిరస్మరణీయం : ఎం. జగ్గరాజు**




చర్లపల్లి, జూన్ 15 (మనం న్యూస్): మహాకవి శ్రీశ్రీ రచనలు నేటికీ సమాజానికి స్ఫూర్తినిస్తూనే ఉన్నాయని ఈసీ నగర్ హౌసింగ్ సొసైటీ కార్యదర్శి ఎం. జగ్గరాజు పేర్కొన్నారు. మహాకవి శ్రీశ్రీ వర్ధంతి సందర్భంగా సోమవారం ఈసీ నగర్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ హాల్లో నిర్వహించిన సంస్మరణ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.

ఈ కార్యక్రమానికి ఈసీ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సహాయ కార్యదర్శి గుమ్మడి హరిప్రసాద్ అధ్యక్షత వహించారు. సభలో జగ్గరాజు మాట్లాడుతూ మహాకవి శ్రీశ్రీ తెలుగు సాహిత్యానికి అందించిన విశిష్ట సేవలను స్మరించుకున్నారు. ఆయన రచనలు సమాజ చైతన్యానికి, అభ్యుదయ భావాలకు ప్రతీకగా నిలిచాయని అన్నారు. శ్రీశ్రీ సాహిత్య ప్రస్థానం, ఆయన కవిత్వంలోని సామాజిక స్పృహ, విప్లవాత్మక ఆలోచనలను గుర్తు చేసుకుంటూ పలువురు వక్తలు నివాళులర్పించారు. తెలుగు సాహిత్యంలో శ్రీశ్రీ చేసిన కృషి తరతరాలకు మార్గదర్శకంగా నిలుస్తుందని పేర్కొన్నారు. అనంతరం మహాకవి శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ కార్యదర్శి గోపాలకృష్ణ, ఈసీ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కోశాధికారి బాల్రెడ్డి, ఏ.బి. చారి, బి.వి. రాజు, విష్ణు, సాహిత్యాభిమానులు, సీనియర్ సిటిజన్లు మరియు స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

# వర్షాకాల సన్నద్ధతపై దక్షిణ మధ్య రైల్వే ఫోకస్

**భద్రతా చర్యలను ముమ్మరం చేయాలని అధికారులకు జీఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవ ఆదేశం..**






సికింద్రాబాద్, జూన్ 15 (మనం న్యూస్) వర్షాకాలంలో రైళ్ల సురక్షిత రాకపోకలు, ప్రయాణికుల భద్రతను నిర్ధారించేందుకు దక్షిణ మధ్య రైల్వే విస్తృత స్థాయిలో సన్నద్ధత చర్యలను చేపట్టింది. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ సోమవారం సికింద్రాబాద్లోని రైల్ నిలయంలో ఉన్నతస్థాయి భద్రతా సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో అదనపు జనరల్ మేనేజర్ సత్య ప్రకాష్, వివిధ శాఖల ప్రధానాధికారులు పాల్గొనగా, సికింద్రాబాద్, హైదరాబాద్, నాందేడ్ డివిజన్ల డివిజనల్ రైల్వే మేనేజర్లు (డీఆర్ఎంలు) వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు. రుతుపవనాలు, ఆకస్మిక గాలులు, భారీ వర్షాల కారణంగా తలెత్తే సవాళ్లను ఎదుర్కొనేందుకు రైల్వే శాఖ చేపట్టిన చర్యలను సమీక్షించారు. వర్షాకాలంలో భద్రతా ప్రమాణాలను ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకుండా అమలు చేయాలని జీఎం స్పష్టం చేశారు. ముఖ్యంగా వరద ముప్పు ఉన్న ప్రాంతాలు, మట్టికోతకు గురయ్యే కట్టలు, వంతెనలు, సొరంగాలు, రోడ్ అండర్ బ్రిడ్జు వంటి సున్నిత ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు ఇసుక, కంకర, సిమెంట్, రాళ్లు వంటి అవసరమైన సామగ్రిని ముందుగానే నిల్వ ఉంచాలని సూచించారు. భారీ వర్షాల సమయంలో అధికారులు స్వయంగా ఇంజిన్ క్యాబిన్ నుంచి 'ఫుట్ప్లేట్ డ్యూటీలు' నిర్వహించి క్షేత్రస్థాయి పరిస్థితులను అంచనా వేయాలని, లోపాలను వెంటనే గుర్తించి పరిష్కరించాలని జీఎం ఆదేశించారు. సరుకు రవాణా కార్యకలాపాల్లో భద్రతా ప్రమాణాలను మరింత కట్టుదిట్టం చేయడంతో పాటు పశువులు పట్టాలపైకి రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ట్రాక్లు, ఓవర్ హెడ్ ఎక్విప్మెంట్ సమీపంలో పెరిగిన చెట్లు, వృక్షసంపద వల్ల ప్రమాదాలు తలెత్తకుండా వాటిని తొలగించాలని, క్షేత్రస్థాయి సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా సంజయ్ కుమార్ శ్రీవాస్తవ మాట్లాడుతూ, వర్షాకాల సన్నద్ధత కేవలం ఒక సీజనల్ ప్రక్రియ మాత్రమే కాదు. ప్రయాణికుల భద్రత, రైల్వే మౌలిక సదుపాయాల పరిరక్షణ పట్ల మా నిబద్ధతకు ఇది నిదర్శనం. ప్రతి అధికారి, ప్రతి సిబ్బంది అత్యవసరతతో, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలి అని అన్నారు. దక్షిణ మధ్య రైల్వే పరిధిలో వర్షాకాలంలో ఎలాంటి అంతరాయాలు లేకుండా రైలు సేవలు కొనసాగేందుకు అన్ని స్థాయిల్లో సమన్వయంతో చర్యలు చేపడుతున్నట్లు అధికారులు వెల్లడించారు.



## వర్ణయా మల్టీ స్పెషాలిటీ క్లినిక్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

సికింద్రాబాద్, జూన్ 15 (మనం న్యూస్) అమీర్పేట్ ధరమ్ కరణ్ రోడ్ ప్రాంగణంలో వర్ణయ మల్టీ స్పెషాలిటీ క్లినిక్ ను ఆదివారం మాజీ మంత్రి ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఘనంగా ప్రారంభించారు. ముందుగా వర్ణయా ఎండి డాక్టర్ జయదీప్ సింగ్ డాక్టర్ సిమ్రాన్ కౌర్ చబ్రా గోల్ మెడలిస్ట్ ఎమ్మెల్యే తలసానికి ఘన స్వాగతం పలికారు. ఆయనకు శాలువాలతో ఘనంగా సన్మానించి బొకేలు అందజేశారు. ఎమ్మెల్యే తలసాని రిబ్బన్ కట్ చేసి మల్టీ స్పెషాలిటీ క్లినిక్ ను ప్రారంభించి నిర్వాహకులకు డాక్టర్స్ జైదీప్, సిమ్రాన్ కౌర్ ప్రత్యేక అభినందనలు తెలిపారు. గురుద్వారా మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ రోజుల్లో ప్రతి మనిషి ఆరోగ్య వంతులుగా ఉండాలని ఆరోగ్యపరంగా ఏ చిన్న సమస్య వచ్చినా వెంటనే దగ్గరలో ఉన్న డాక్టర్స్ ను సంప్రదించాలని వారి చెప్పిన సూచనలను తీసుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే తలసాని, అలాగే డాక్టర్ జయదీప్ సిమ్రాన్ కౌర్ మాట్లాడుతూ వర్ణయ క్లినిక్ ను ఘనంగా ప్రారంభించిన ఎమ్మెల్యే తలసానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అమీర్పేట్ ధరమ్ కరణ్ రోడ్డు ప్రాంగణంలో అందరికీ అందుబాటులో క్లినిక్ ఉందని ఆర్థోపెడిక్, డెర్మటాలజీ ట్రీట్మెంట్లు ఉంటాయని ఆర్తోలో రోబోటిక్ జాయింట్ రీప్లేస్మెంట్, కీ హోల్ సర్జరీ, షోల్డర్ సర్జరీ నీ యాంకిల్ సర్జరీ, అత్యాధునిక వైద్య వసతులు అందుబాటులో ఉంటాయని అన్నారు. అలాగే స్కిన్ కు సంబంధించి స్పెషలైజేషన్ ఎసిటిక్ ప్రొసీజర్, బూటాక్స్ పిల్లర్స్, లేజర్ పర్మినెంట్ హెయిర్ రిమూవల్, స్కార్ సర్జరీస్, ఇలా అనేక రకాలు వైద్య వసతులు అందుబాటులో ఉన్నాయని సమస్య చిన్నగా ఉన్నప్పుడే డాక్టర్ ను సంప్రదించి వారి యొక్క సూచనలు పాటించాలని అప్పుడే మనిషి ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు, ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ నామాన శేషు కుమారి, డివిజన్ అధ్యక్షులు కొలను బాల్రెడ్డి, ముత్యాల హనుమంతరావు, జనరల్ సెక్రెటరీ నామాన సంతోష్ మణి కుమార్ , బిఆర్ఎస్ సీనియర్ నాయకులు అశోక్ యాదవ్, ప్రవీణ్ రెడ్డి, గులాబ్ సింగ్ రాజ పురోహిత్, గోపి లాల్ చౌహాన్, కూతురు నరసింహ, కట్టా బలరాం, ప్రదీప్ గౌడ్, గొలుసులు సత్యనారాయణ క్లినిక్ యాజమాన్యం తదితరులు పాల్గొన్నారు

# ఇంకుడు గుంతలను పునరుద్ధరించాలి

**– పర్యావరణ ప్రేమికులు కోల రవీందర్ ముదిరాజ్**





మేడ్చల్, జూన్ 15 ( మనం జిల్లా ప్రతినిధి ): గతంలో తీసినటువంటి ఇంకుడు గుంతలను పునరుద్ధరించాలని, ఇంకుడు గుంతలు తీయకపోతే భవిష్యత్తులో 3 వేలఅడుగుల బోరువేసిన మూడు చుక్కల నీరు రావని పర్యావరణ ప్రేమికులు కోల రవీందర్ ముదిరాజ్ తెలిపారు. ఎక్కడ చూసినా సిసి రోడ్లు, కాలికి మట్టి పంటని పరిస్థితి, మున్సిపాలిటీగా ఉన్నప్పుడు వందలాది ఇంకుడు గుంతలు తీయడం జరిగిందని,అందులో భాగంగా సూరారం కాలనీ రామ్ లీలా మైదాన్ ఎదురుగా భారీ ఇంకుడు గుంతలు తీయడం జరిగిందని,వాటిపై మట్టి పోశారని జోనల్ కమిషనర్ కు అందజేసిన వినతిపత్రంలో తెలిపారు , ఇంకుడు గుంతలు సర్కిల్ పరిధిలో చాలా ఉన్నాయి వాటిని పరిశీలించి పునరుద్ధరించాలని జోనల్ కమిషనర్ ను కోలా రవీందర్ ముదిరాజ్ కోరారు.ఇంకుడు గుంతలు లేని అపార్ట్మెంట్లపై కఠిన చర్యలు తీసుకోవాలని, వర్షం పడ్డప్పుడు ఒక్క చుక్క నీరు కూడా బయట రాకుండా అపార్ట్మెంట్ వారు చర్యలు తీసుకునే విధంగా వారికి అవగాహన కల్పించాలి, వారికి మెట్రో వాటర్ కనెక్షన్ కట్ చేయాలన్నారు. వారాంతపు సంతలలో ఫంక్షన్ హాల్లో హోటళ్లలో నాణ్యతలేని ప్లాస్టిక్ కవర్లు ప్లాస్టిక్ తో తయారైన ఇస్తరాకులు, వాడకుండా ఫంక్షణాలకు నోటీసులు ఇవ్వాలని,గాజుల రామారౌసర్కిల్ కమిషనర్ కు కూడా వినతిపత్రం అందజేశారు., జోనల్ కమిషనర్,గాజుల రామారం,ఉప కమిషనర్ స్పందిస్తూ వెంటనే ఫంక్షన్ హాల్ వారికి నోటీసులు ఇస్తామని నాణ్యతలేని ప్లాస్టిక్, కవర్లు, ఇస్తరాలను నివారిస్తామ ని హామీ ఇవ్వడం జరిగింది,ఈ కార్యక్రమంలో ఎండి అఖిల్, భాషా భాయ్, అనీఫ్, విక్రమ్ రెడ్డి,తిరుమల కాలనీ అధ్యక్షులు కార్యదర్శి మొదలగువారు పాల్గొన్నారు.


# మహిళా సాధికారతకు ఉప్పల్ ఎమ్మెల్యే ప్రోత్సాహం

**ఉచిత టైలరింగ్ శిక్షణ పూర్తి చేసిన మహిళలకు సర్టిఫికెట్ల పంపిణీ రెండో బ్యాచ్కు శ్రీకారం – స్వావలంబనతో ముందుకు సాగాలని మహిళలకు పిలుపు**






కాప్రా, జూన్ 15 (మనం న్యూస్): మహిళా సాధికారత లక్ష్యంగా చైల్ వికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత టైలరింగ్ శిక్షణ కార్యక్రమం తొలి బ్యాచ్ ముగింపు వేడుక మరియు సర్టిఫికెట్ పంపిణీ కార్యక్రమం ఉప్పల్ డివిజన్ పరిధిలోని బీరప్పగడ్డలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన మహిళలకు సర్టిఫికెట్లు అందజేసి అభినందనలు తెలిపారు.




ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించి కుటుంబాభివృద్ధితో పాటు సమాజాభివృద్ధిలోనూ కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. నైపుణ్యాభివృద్ధి ద్వారా మహిళలకు ఉపాధి అవకాశాలు విస్తరించి, ఆత్మవిశ్వాసం పెరుగుతుందని పేర్కొన్నారు.

అనంతరం ఉచిత టైలరింగ్ శిక్షణ కార్యక్రమం రెండో బ్యాచ్ను ప్రారంభించారు. ఇటువంటి శిక్షణా కార్యక్రమాలు మహిళల జీవనోపాధికి బలమైన పునాదిగా నిలుస్తాయని, మహిళా సాధికారత కోసం స్వచ్ఛంద సంస్థలు మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో చైల్ వికాస్ ఫౌండేషన్ ప్రతినిధి రమేష్, శిక్షణ పొందిన మహిళలు, స్థానిక నాయకులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, సామాజిక కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.